# పెన్నేటి కతలు

- రామకృష్ణారెడ్డి

# జీరంగి

మునెయ్య దగ్గరుండే జీరంగిని సూసి వాళ్ళూరి శివునికి పిల్లోళ్ళగ్గూడా అదే కనపడ్తాంది. ఎంత పెద్దదో! ఎంత బాగుండాదో! ఎన్ని రంగులుండాయో దానికి! కలుపుతీయను బోయినవాళ్ళమ్మకాడికి పోతే, సేలో దొరికిందంట అది. అది ఎగిరేటప్పుడైతే 'బుర్, బుర్' అని యింగా బాగుంటాదంట. మునెయ్య జీరంగి కతలు సెప్తావుంటే, శివుడూ, బింగిసెవులోడూ, సత్తోడూ, నాగన్నా రోజూ యింటావుండారు నోరు తెర్సుకోని. అగ్గిపెట్లో తుమ్మాకు పర్సి, దాని మీంద జీరంగిని పండుకోబెట్టి, అగ్గిపెట్టెను సల్లాడంజోబులో యేసుకున్నాడు మునెయ్య.

జీరంగుండే అగ్గిపెట్టెను అట్ట జోబులో పెట్టుకోనుండే మునెయ్యను యిచిత్రంగా సూస్తా వుంటారు వాళ్ళు. "ఎట్టుండాది?" అని మునెయ్య మొకంలోకి సూస్తా అడుగుతారు. "అది మోర్తా వుండేది నాకు యినపడ్తాంది" అంటాడు మునెయ్య. "ఏదీ మేం సూస్తాం" అనడిగితే, "పొద్దాకులూ సూడగూడ్దు, అట్ట సూస్తావుంటే గుడ్లు పెట్టదు" అని ఎచ్చరిస్తాడు మునెయ్య. అది గుడ్లు పెట్తే వాళ్ళకు గుడ్లు యిస్తానని సెప్పినాడు గనక, వాళ్ళింక సూస్తామని అడగలేరు. అట్టడగరు గాని, మునెయ్య పోయినకాడికల్లా వాళ్ళా పోయి, మునెయ్య సల్లాడంజోబుకాడ వొంగోని సెవులు బెట్టి యిని, "మోదలేదే...!" అనడుగుతారు. "సక్కోళ్ళకు యినపడ్దు, అగ్గిపెట్టె జోబులో వున్నోనికే యినపడేది" అంటాడు మునెయ్య.

"అబ్బా...బ్బా! నా జోబులో రొంతసేపు యేసుకోని యింటా బా..." అని అందరూ అడుగుతారు. "తావు మార్సగూడ్దు" అంటాడు మల్లా మునెయ్య. మొదుట్లో శివునికి కలవరంలో రంగు రంగుల జీరంగే కనపడేది. తన సేలో కంది సెట్టు కింద కూకోనుంటే 'బుర్'మని సెబ్దమయి తానే ముందుగా యిమానం అనుకున్నాడంట మునెయ్య. మల్లజూస్తే, యీ జీరంగంట! సిన్న... సిన్నదోయి తటక్కన పట్టుకొన్నాడంట. ఇట్లెప్పి నాక, శివునికి కలవరంలో కనపన్నెప్పుడు జీరంగి 'బుర్'మని యిమానమాల మోదడం మొదులు పెట్టింది. ఒక్కొక్కసారి దూరాన యిమానమాల వుండి, దగ్గిరికొచ్చినాక రంగు రంగుల జీరంగయి పోతాది.

ముందు జీరంగిని పట్టుకొన్నెప్పుడు, దాని పెండ్లాంగూడా సక్క కందిసెట్టు మీనున్నెట్టు సెప్పి నాడు మునెయ్య. "పొద్దాకులూ సూస్తే గుడ్లు పెట్టదు" అన్సెప్పినప్పుడు, "మొగదని, దాని పెండ్లాం గూడా వున్నిందని సెప్తివే, గుడ్లెట్ట పెడ్తాది?" అని బింగిసెవులోడు అడిగినాడు. "కాదు, ఆ సక్కనున్నింది దీని మొగుడు" అని తేల్సినాడు మునెయ్య అన్నడు. "ఎట్ట తెల్సు?" అంటే, ఆడ్దానికైతేనే అంత మోతుంటాదని, మొగదానికైతే అంతుండనే వుండదని, వూరికే 'సిర్, సిర్' మంటాదని సెప్పినాడు. "ఆడ్దయిన్దాన్నే తుమ్మాకు మీంద గుడ్లు పెట్టడానికని పండుకోనుండాది. మొగదైతే ఎందుకు పండుకోనుంటాది?" వాళ్ళు "అవు" అన్నారు. బింగి సెవులోడు గూడా అట్టడిగింది మునెయ్య అబద్దం సెప్తావుండాడని కాదు, కతలో ముందటికీ యెనక్కీ యాదన్నా తేడా కనపడ్తే, యినేవాళ్ళడగరూ, అట్టడిగినాడు. అంతే!

అయితే, మునెయ్యట్టా కాదు. వాడు వాళ్ళకంటే పెద్దోడు. జీరంగిని ముందు సూపిచ్చినప్పుడు మొగదని, మాంచి పాయంలో వుండాదని సెప్పినాడు. అట్ట సెప్పినోడే అది ఆడ్దని మల్ల సెప్పాల్సి వొచ్చింది. "ఒక్కసారి సూపిచ్చు, ఒక్కసారి సూపిచ్చు" అంటడుగుతా, నల్గురూ మునెయ్యకు తినేటియి పెట్టడం మొదులుపెట్నారు. సెనిక్కాయి పప్పులూ, బెల్లం, జొన్న రొట్టె యిట్ట వాళ్ళింది తెచ్చుకుంటే అది యియ్యబట్నారు. యీ సక్కోడూ ఆ సక్కోడూ యిచ్చేది రొండు సేతుల్తో తీసుకోని తింటా మునెయ్య, ఒకసారి జోబులో నుంచి అట్ట అగ్గిపెట్టెను బైటికి తీసి సూపిస్తే, యింగోసారి జోబులో వుండంగనే తట్టడిసి[4] సూపుతా వొచ్చినాడు. ఎంత కాదన్నా వాళ్ళ నోటికాడియి తను తినిందాన జీరంగి గుడ్లు



పెట్నాక ఆ గుడ్లు యిస్తానని మాటిచ్చినాడు వాళ్ళకు. ముందు మొగదని సెప్పిన జీరంగిని, మల్ల ఆడ్దని సెప్పడమే అన్ని రకాలా నాటంగా కనపడింది మునెయ్యకు. ఆడ్దని సెప్పిన్దాన్నే గుడ్లనిస్తానని అన్నాడు. వాళ్ళు పొద్దాకులూ సూపియ్యమన కుండా, సూపిస్తే గుడ్లు పెట్టదని బెదిరిచ్చినాడు. యిప్పుడు వాళ్ళు జీరంగిని సూపియ్యమనకుండా "గుడ్లు పెడ్తాందా?" అనడగబట్నారు. "రేపో, మన్నాడో పెడ్తాది" అని సెప్తావొచ్చినా, అప్పుడప్పుడూ సూపిచ్చక తప్పేదిగాదు. "ఏం జేస్తావుండాదో సూస్తాం" అని ఆత్రంగా సూస్తే ... అది ఏంజేస్తావుండేదిగాదు. అగ్గిపెట్లో తుమ్మాకు మీంద అట్నే పండుకోని వుండేది. సచ్చిపోయిందేమో అని, అగ్గిపెట్నూపాంటే[5], అది సిన్నంగా సావుజంపుయిగా కాళ్ళు కదిలిచ్చేది. ఆకిరికి... అది మునెయ్యకు సేలో దొరికినప్పుడు, 'బుర్'మని యిమానమాల ఎగుర్తావొచ్చిందన్న సంగతి యెవురికీ గ్యాపకమే ల్యాకుండాపోయింది. యిది కనిపెట్న మునెయ్య "జీరంగీ గుడ్లూ మీకు మీకే తీసుకోపొండి" అని యిచ్చినాడు. జీరంగి వున్న అగ్గిపెట్టెను తలా యింతసేపు పట్టుకుంటే వాళ్ళ సేతులు నొనికినాయి. దాన్ని ఒక్కొక్కరి దగ్గిరా రొన్ని రోజులు పెట్టుకోవాలనుకొన్నారు. అయితే, ఎవురి దగ్గిరా దాన్ని పెట్టుకోడానికి కుదర్లా. వాళ్ళ పెద్దోళ్ళు జీరంగిని యింట్లోకి తెస్తే, ఎనములు తంతాయని పారెయ్యనని అర్సినారు. జీరంగిని తెచ్చింది ఎనముల కెట్ట తెల్సుతాదో అనుకొన్నారు. ఎనములు ల్యాకుండా వుంటే జీరంగిని వుంచుకోని వుందుముగదా అనుకొన్నారు.

ఏమనుకొన్నా దాన్ని మల్లా మునెయ్యకాడికి తీసకరాక తప్పలేదు. "నా కొద్దు, మీకు మీకే యిచ్చినా గదా" అన్నాడు మునెయ్య. "అబ్బబ్బా... తీసుకోబ్బా, మావాళ్ళు అర్సుతాండారు" అని బంగపోయినారు. "అయితే పారెయ్యండి" అన్నాడు మునెయ్య. అగ్గిపెట్టె తెర్సి సూస్తే... పారేసినా అది అన్నే పడుంటాదని అనిపిస్తాంది. ఎగిరేది మర్సిపోయినట్టుండాది. అట్టాటిదాన్ని ఎట్ట పారెయ్యాల? వాళ్ళకు దిక్కు తెల్లా. జీరంగి అట్టయినందుకో, వాళ్ళ పెద్దోళ్ళు అర్సుతావున్నందుకోగాని వాళ్ళ కండ్లకు నీళ్ళొచ్చినాయి. జీరంగిని తీసుకొన్నందుకు మునెయ్యకు తినేటియి పెడ్తానే వుంటామని, కండ్ల నీళ్ళతోనే వొప్పుకొన్నారు!

1. నిక్కరు 2. ధ్వనిస్తూ 3. పదేపదే 4. తట్టిచూపి 5. కదిలిస్తే



22-9-89 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక